



# కెరటం న్యూస్

(సామాన్యుడి ఆయుధం)







Published from.. Hyderabad, Khammam, Warangal, Nalgonda

సంపుటి : 04 సంచిక : 255 | మంగళవారం 16- సెప్టెంబర్ 2025 | ఎడిటర్ : వనం నాగయ్య | పేజీలు : 4 ఫోన్ : 9441877695


## నాలాపై ఉన్న 145 ఇళ్లు..

## అడ్డుగా ఉన్న ఇళ్లు తొలగిస్తాం..!



**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** హైదరాబాద్ ఆదివారం రాత్రి భారీ వర్షాలతో వణికిపోయింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వాన కారణంగా నగరంలోని అనేక ప్రాంతాలు మునిగిపోయాయి. ఫ్లాష్‌ఫ్లడ్స్ కారణంగా రోడ్లు, కాలనీలు వరద నీటితో నిండిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఆసిఫ్‌నగర్‌లోని మాంగర్‌బస్తీ ప్రాంతం అతలాకుతలమైంది. వరద నీటికి ఇద్దరు కొట్టుకుపోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆ ఘటనతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

జిల్లా కలెక్టర్ హరిచందన, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తక్షణమే రంగంలోకి దిగారు. మాంగర్‌బస్తీ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా సందర్శించి, అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలకు జరిగిన ఇబ్బందులను తెలుసుకొని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి స్పష్టమైన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు.

## ఇప్పుడు ఆ దిక్కుమాలిన విషయం ఎందుకు?

### కవిత ఆరోపణలపై ఈటల వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఈటల రాజేందర్ సహా పలువురు సీనియర్లు బీఆర్ఎస్ ను వీడిపోవడానికి హరీశ్ రావు, సంతోశ్ రావే కారణం అంటూ తెలంగా జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన వ్యాఖ్యలపై ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నన్ను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించి వారు ఏం సాధించారని ప్రశ్నించారు. నేను నవ్వు ముఖంతోనే ఉన్నానని చెప్పారు. సోమవారం హుజూరాబాద్ లో మీడియాతో మాట్లాడిన సందర్భంగా కవిత ఆరోపణలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నపై ఈటల స్పందించారు. యూరియా, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి ఇంత మంచి సబ్జెక్ట్ పై మాట్లాడాక ఆ దిక్కుమాలిన విషయం గురించి ఎందుకు అని అన్నారు. ఆ పార్టీలో ఉండగా నన్ను హింస పెడితే పెట్టొచ్చు. కానీ నాకేమొచ్చింది వారికి ఏమొచ్చిందో అందరికి తెలుసన్నారు. భూలోకంలోనే నరకం అనుభవించిన వ్యక్తిని నేను అని చెప్పారు.



## బండి సంజయ్ పై రూ.10 కోట్ల

## పరువు నష్టం దావా వేసిన కేటీఆర్

- హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో కేటీఆర్ లీగల్ ఫైట్ – డిసెంబర్ 15కి వాయిదా
- నా ఫోన్ కూడా ట్యాప్ చేశారు – బండి సంజయ్
- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీ దుర్వినియోగం జరిగిందని ఆరోపించిన బండి సంజయ్
- లీగల్ నోటీసుకు స్పందించని బండి సంజయ్‌పై కేటీఆర్ నేరుగా కోర్టు ద్వారానే పోరాటం

**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ న్యాయ పోరాటానికి దిగారు. ఈ మేరకు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో బండి సంజయ్‌పై రూ.10 కోట్ల పరువు నష్టం దావా దాఖలు చేశారు కేటీఆర్. కేటీఆర్ పిటిషన్‌ను 2025, డిసెంబర్ 15కి వాయిదా వేసింది సిటీ సివిల్ కోర్టు. బండి సంజయ్ ఏమన్నారంటే..?

తెలంగాణ పాలిటిక్స్ లో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై గతంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్ఐబీను కేటీఆర్ సొంత అవసరాలకు వాడుకున్నారని.. కేసీఆర్ దగ్గర పనిచేసిన మంత్రుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు.

### నీ సంగతి త్వరలో బయటపెడతా

#### : బండి సంజయ్ రియాక్షన్

ఫోన్ ట్యాపింగ్ కేసులో నిరాధార ఆరోపణలు చేశారని కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రూ.10 కోట్ల పరువు నష్టం దావా వేశారు. ఈ క్రమంలో కేటీఆర్ పరువు నష్టం దావా కేసుపై బండి సంజయ్ స్పందించారు. సోమవారం ఆయన కరీంనగర్ లో మీడియాతో మాట్లాడుతూ.. కేటీఆర్ పరువు నష్టం దావా వేసి బెదిరించే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు.కేటీఆర్ వేసిన డిఫమేషన్ కేసును న్యాయపరంగా ఎదుర్కొంటానని తెలిపారు. గతంలో తొమ్మిది సార్లు జైల్ కు వెళ్ళి వచ్చా.. నాపై వందకు పైగా కేసులు ఉన్నాయని ఇలాంటి ఉడత ఊపులకు భయపడేది లేదన్నారు.

### ఇందిరమ్మ రాజ్యం అని గప్పాలు కొట్టి ఆడబిడ్డలను చదువుకు దూరం చేస్తారా?: కవిత

**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలను ఎగవేస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు.



## రేవంత్ రెడ్డి ఆటలతో

## పేద రైతులకు శాపాలు: హరీశ్ రావు

- ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్పుపై బీఆర్ఎస్ తీవ్ర విమర్శలు
- రైతుల భూములు మాయం చేసి, కాంగ్రెస్ నేతల భూములు కాపాడుతున్నారు" – హరీశ్ రావు ఆరోపణ
- 'అలైన్‌మెంట్ మార్పు రైతుల జీవితాలతో ఆటలు ట్రిపుల్ ఆర్ వివాదంపై ప్రభుత్వానికి బీఆర్ఎస్ హెచ్చరిక



**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** రీజనల్ రింగ్ రోడ్డు అలైన్ మెంట్ తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆడుతున్న ఆటలు పేద రైతులకు శాపంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు అలైన్మెంట్ను కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారీతిగా మారుస్తూ పేద రైతుల పొట్ట కొడుతుండటం దుర్మార్గం అన్నారు. ఇష్టారీతిన ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ మార్చి తమ కడుపు కొడుతున్నారని సంగారెడ్డి నియోజకవర్గం కొండాపూర్ మండలం గ్రామాల రైతులు సోమవారం హరీశ్ రావును కలిసి తమ ఆవేదన చెప్పుకున్నారు. ఈ సందర్భంగా రైతులకు భరోసా ఇచ్చిన ఆయన.. రైతులు భూములు కోల్పోకుండా ప్రభుత్వాన్ని నిలదీస్తామని హామీ ఇచ్చారు.

## వక్ఫ్ సవరణ చట్టంలోని

## కీలక నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే




**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. వక్ఫ్ (సవరణ) చట్టం, 2025 లోని కొన్ని నిబంధనలను సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. వక్ఫ్ (సవరణ) చట్టం, 2025 ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన సీజేఐ బి ఆర్ గవాయ్ ,న్యాయమూర్తి అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. మొత్తం సవరణను నిలిపివేయాలని కేసు వేయలేదు.. సవరణ చట్టంలోని కొన్ని నిబంధనలను నిలిపివేసినట్లు కోర్టు తెలిపింది.

వక్ఫ్ సవరణ చట్టంపై దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. పూర్తి స్థాయి వక్ఫ్ చట్టంపై స్టే విధించేందుకు నిరాకరించింది. వక్ఫ్ చట్టంలోని కొన్ని అంశాలపై స్టే ఇచ్చింది. ఆస్తులు వక్ఫ్ బోర్డువా కాదా అనేది కోర్టులు తేలుస్తాయి..వివాదాస్పద ఆస్తులపై థర్డ్ పార్టీ జోక్యం చేసుకోకూడదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. వక్ఫ్ బోర్డులో ముగ్గురికి మించి ముస్లిమేతరులు ఉండకూడదని తీర్పునిచ్చింది.

## తెలంగాణ జర్నలిస్టులకు గుడ్ న్యూస్..

### అక్రిడిటేషన్‌లపై మంత్రి పొంగులేటి కీలక అప్డేట్



**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో హోమ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా, ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి, ఐ&పీఆర్ స్పెషల్ కమిషనర్ సీహెచ్. ప్రియాంక, సీపీఆర్వో జీ.మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్ట్‌ల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

## సెప్టెంబర్ 17 విమోచనం కాదు..

## బరాబర్ విలీనమే

### : బీజేపీ నేతలపై వీహెచ్ ఫైర్



**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు, తెలంగాణ ప్రజలను మభ్య పెట్టేందుకు బీజేపీ కొత్త రాగం ఎత్తుకున్నదని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వీ.హనుమంత రావు తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 17 గురించి మాట్లాడే అర్హత బీజేపీకి ఏమాత్రం లేదని అన్నారు. సెప్టెంబర్ 17 విమోచనం కాదు.. బరాబర్ విలీనమే అని స్పష్టం చేశారు.

## హిందూ మతంలో సమానత్వం ఉంటే

## ఎవరైనా ఎందుకు మతం మారతారు..?

### కర్నాటక సీఎం సిద్ధరామయ్య



**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** హిందూ మతం, మతమార్పిడిలపై కర్నాటక సీఎం సిద్ధరామయ్య హాట్ కామెంట్స్ చేశారు. బెంగళూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హిందూ సమాజంలో సమానత్వం ఉంటే ఎవరైనా ఎందుకు మతం మారుతారు..? అని ప్రశ్నించారు. హిందూ మతంలో సమానత్వం ఉంటే మతమార్పిడి జరిగేది కాదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. హిందూ సమాజంలో సమానత్వం ఉంటే మరీ అంటరానితనం ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. ఇస్లాం, క్రైస్తవం ఇతర ఏ మతంలోనైనా అసమానతలు ఉంటాయని.. అంటరానితనాన్ని మనమే సృష్టించామా..? అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ ఇతర ఏ పార్టీలు కూడా మతం మారమని ప్రజలకు చెప్పలేదని.. కానీ ప్రజలు తమ నమ్మకాలకు అనుగుణంగా మతం మారుతారని.. అది వారి హక్కు అని అన్నారు.

# బండి సంజయ్ పై రూ.10 కోట్ల పరువు నష్టం దావా వేసిన కేటీఆర్

సినిమా వాళ్లు, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారన్నారు.

గ్రూప్1 పేపర్ లీకేజీ ఆందోళన సమయంలో నా ఫోన్ ట్యాప్ చేసి పోలీసులు ముందుగానే మా ఇంటికి వచ్చారని అన్నారు. గ్రూప్- 1 పేపర్ లీకేజీ కేసు విచారించిన జడ్జి ఫోన్ కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. పెద్ద వ్యాపారుల ఫోన్లు, జర్నలిస్టులు ఫోన్లు కూడా కూడా ట్యాప్ చేశారని అన్నారు. ఓవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ జరుగుతుండగా బండి సంజయ్ తనపై ఆరోపణలు చేయడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ మేరకు 2025, ఆగస్ట్ 12న బండి సంజయ్‌కు లీగల్ నోటీస్ పంపారు కేటీఆర్. ఫోన్ ట్యాపింగ్ కేసులో తనపై చేసిన ఆరోపణలపై 48 గంటల్లో క్షమాపణలు చెప్పాలని.. లేదంటే కోర్టుకు లాగుతానని హెచ్చరించారు. నోటీసులపై బండి సంజయ్ స్పందించకపోవడంతో కేటీఆర్ న్యాయ పోరాటానికి దిగారు. ఈ మేరకు హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో రూ.10 కోట్ల పరువు నష్టం దావా వేశారు.

# నీ సంగతి ఏందో త్వరలో బయటపెడతా

## : బండి సంజయ్ రియాక్షన్

తాను లవంగం తింటే తంబాకు తిన్నానని అన్నారు. కావాలనుకుంటే కేటీఆర్ లాగా నేను పరువు నష్టం దావా కేసులు వేయొచ్చు. కానీ నేను రాజకీయంగా ఎదుర్కొంటా.. ఇలా పరువు నష్టం దావాలు వేసి బెదిరించే ప్రయత్నం చేయనని చెప్పారు.

బీఆర్ఎస్ హయాంలో ఫోన్లు ట్యాప్ చేయకపోతే కుటుంబ సభ్యులతో సహా దేవుడు సన్నిధికి రమ్మని సవాల్ విసిరా. మరీ కేటీఆర్ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కేటీఆర్ అమెరికాలో ఎవరెవరిని కలిశాడో.. ఆయన సంగతి ఏందో త్వరలో బయటపెడతానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు బండి సంజయ్.

కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ న్యాయ పోరాటానికి దిగారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ జరుగుతోన్న సమయంలో తనపై నిరాధార ఆరోపణలు చేశారని హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో బండి సంజయ్‌పై కేటీఆర్ రూ.10 కోట్ల పరువు నష్టం దావా దాఖలు చేశారు. కేటీఆర్ పిటిషన్‌పై విచారణను 2025, డిసెంబర్ 15కి వాయిదా వేసింది సిటీ సివిల్ కోర్టు.

# రేవంత్ రెడ్డి ఆటలతో పేద రైతులకు శాపాలు

## : హరీశ్ రావు

**అష్టవంకర్లతో పొలాల మాయంకు కుట్ర:**

కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత చర్యల వల్ల రైతన్న నోట్లో మట్టి కొడుతోందని హరీశ్ రావు ఆరోపించారు. నార్త్ అలైన్మెంట్ మార్పు వల్ల సంగారెడ్డి నియోజకవర్గం కొండాపూర్ మండలంలోని గిరిమాపూర్, తుమ్మరపల్లి, అలియాబాద్, మారేపల్లి, రాంపూర్ తాండ, గోటిలగుట్ట తండా, మాచేపల్లి తండా, శివన్న గూడెం, గంగారం గ్రామాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ఈ గ్రామాల్లో ఎక్కువగా నివస్తిస్తున్నది ఎస్టీ, ఎస్సీ బీసీ రైతులేనన్నారు. అలైన్ మెంటు మార్పుతో పేద బడుగు బలహీనవర్గాలకు చెందిన రైతులే తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. రైతులు భూములు కోల్పోకుండా మొదటగా ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ను బీఆర్ఎస్ ప్రభుత్వం గిర్మాపూర్ చేవెళ్ల మీదుగా ప్రతిపాదిస్తే రేవంత్ రెడ్డి మాత్రం తన స్వలాభం కోసం వికారాబాద్, పరిగి, కొడంగల్ మీదుగా ట్రిపుల్ ఆర్ మార్గాన్ని అష్టవంకరలుగా తిప్పుతూ పచ్చటి పొలాలను మాయం చేసే కుట్రకు తెరలేపారని ఆరోపించారు.

**సొంత భూముల కోసమే:**

సొంత భూములకు మేలు కలిగేలా ముఖ్యమంత్రి అలైన్మెంట్ ను అడ్డగోలుగా మార్చడం దుర్మార్గం అని గంగారం, శివన్న గూడెం గ్రామంలోని పూర్తి భూమి కోల్పోయి గ్రామం మొత్తం నిర్వాసితులు అవుతున్నారు. ఇంతమంది రైతుల ఆవేదన రేవంత్ రెడ్డికి అర్థం అవడం లేదా అని ప్రశ్నించారు. ఒక ఊరికి ఊరే పూర్తిగా నీ ధన దాహానికి బలైతుంటే కనీసం నీకు దయలేదా రేవంత్ రెడ్డీ? అని నిలదీశారు. రియల్ ఎస్టేట్ వెంచర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకుల భూములు ఎక్కడ కూడా నష్టపోకుండా కేవలం రైతుల పొలాలు మాత్రమే నష్టపోయేలా ప్రతిపాదించడం సిగ్గుచేటన్నారు. ఎన్నికల ముందు ట్రిపుల్ ఆర్ ను తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తర్వాత పేద రైతులను బలి చేస్తూ కాంగ్రెస్ నాయకుల భూములను కాపాడుతోందన్నారు. ఇది కేవలం సంగారెడ్డి నియోజకవర్గ సమస్య కాదని ట్రిపుల్ ఆర్ అలైన్మెంట్ విషయంలో ప్రభుత్వం నిస్సిగ్గుగా వ్యవహరిస్తూ ఇష్టారీతిగా అలైన్మెంట్ ని మారుస్తూ రైతుల జీవితాలతో ఆడుకుంటున్నదని మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ డివిజన్ పరిధిలో ట్రిబుల్ ఆర్ అలైన్మెంట్ ను ఓఆర్ఆర్ నుంచి 40 కిలోమీటర్లు బదులుగా 28 కిలోమీటర్లకు కుదించడానికి నిరసిస్తూ భూ నిర్వాసితులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుంటే ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదన్నారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణం తన ఇంటి వ్యవహారం కాదని రాష్ట్రం, రైతుల ప్రయోజనాలు ఫణంగా పెట్టే చర్యలు ఆపక పోతే బీఆర్ ఎస్ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

# హిందూ మతంలో సమానత్వం ఉంటే ఎవరైనా ఎందుకు మతం మారతారు..? సీఎం సిద్ధరామయ్య

హిందూ మతంలో సమానత్వం ఉంటే ఎవరైనా ఎందుకు మతం మారతారంటూ సీఎం సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలు కన్నడ పాలిటిక్స్‌లో కాకరేపాయి. సిద్ధరామయ్య వ్యాఖ్యలపై ప్రతిపక్ష బీజేపీ ఎదురుదాడికి దిగింది. కర్నాటక ప్రతిపక్ష నేత ఆర్ అశోక, చలవాడి నారాయణస్వామి వంటి ప్రతిపక్ష నాయకులు సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలపై భగ్గుమన్నారు.

ముస్లింల మెప్పు కోసం సిద్ధరామయ్య హిందు మతంలో చిచ్చురేపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందువులను టార్గెట్ చేసుకుని కులం, మతం ఆధారంగా ప్రజలను విభజించడానికి ప్రయత్నించారని ఫైర్ అయ్యింది. సమానత్వం గురించి చర్చ వస్తే సీఎం సిద్ధరామయ్యకు మొదట హిందూ మతమే గుర్తొస్తోంది.

మరీ సమానత్వంపై ముస్లింలను ప్రశ్నించే ధైర్యం ఉందా అని సీఎం సిద్ధరామయ్యకు సవాల్ విసిరారు ప్రతిపక్ష నేత అశోక. పహల్గామ్ ఉగ్రవాద దాడి, మసీదులలో మహిళలపై ఆంక్షలు, ట్రిపుల్ తలాక్‌ను నిషేధించడానికి వ్యతిరేకత, ముస్లిమేతరులకు ఖురాన్ వంటి ఇస్లాంలోని మత ఆచారాలను గుర్తు చేసి.. వీటిని సీఎం సిద్ధరామయ్య ప్రశ్నించగలరా అని సవాల్ విసిరారు.

# వక్ఫ్ సవరణ చట్టంలోని కీలక నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే



వక్ఫ్ సవరణ చట్టంలోని మూడు కీలక అంశాలపై స్టే ఇచ్చింది సుప్రీంకోర్టు.

5 సంవత్సరాలు ముస్లింలు ఉండాలనే నిబంధన

వక్ఫ్ భూములపై కలెక్టర్ నిర్ణయం తీసుకోవద్దు

వక్ఫ్ సంస్థలలో ముగ్గురి కంటే ఎక్కువ మంది ముస్లిమేతరులను ఉండొద్దు

ఇది తుది తీర్పు కాదు.. కోర్టు పరిశీలన మాత్రమే..చట్టం చెల్లుబాటును సవాలు చేస్తూ పార్టీలు తదుపరి వాదనలు వినిపించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

# సెప్టెంబర్ 17 విమోచనం కాదు.. బరాబర్ విలీనమే: బీజేపీ నేతలపై వీహెచ్ ఫైర్

**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** స్థానిక ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు, తెలంగాణ ప్రజలను మభ్య పెట్టేందుకు బీజేపీ కొత్త రాగం ఎత్తుకున్నదని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వీ.హనుమంత రావు తీవ్ర విమర్శలు చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 17 గురించి మాట్లాడే అర్హత బీజేపీకి ఏమాత్రం లేదని అన్నారు. సెప్టెంబర్ 17 విమోచనం కాదు.. బరాబర్ విలీనమే అని స్పష్టం చేశారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టడం బీజేపీ నేతలకు అలవాటే అని విమర్శించారు. కులాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందడం వారికి పరిపాటిగా మారిందని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా తెలంగాణ ప్రజలు అమయకులు కాదు.. చైతన్యవంతులు అని చెప్పారు. ఇదిలా ఉంటే.. కేంద్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు నిర్వహించేందుకు తెలంగాణ బీజేపీ పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నది. ఈ వేడుకలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, గజేంద్ర సింగ్ షెకావత్, బండి సంజయ్ , మహారాష్ట్ర మంత్రులు, రాష్ట్ర పార్టీ నాయకులు హాజరుకానున్నారు. అంతేకాదు.. పరేడ్ గ్రౌండ్ సమీపంలోని కంటోన్మెంట్ పార్కులో దివంగత మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు.

# ఇందిరమ్మ రాజ్యం అని గప్పాలు కొట్టి ఆడబిడ్డలను చదువుకు దూరం చేస్తారా?: కవిత



**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఫీజు రియింబర్స్ మెంట్ బకాయిలను ఎగవేస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఇది కమిషన్ల సర్కార్ అని.. 20 శాతం కమీషన్లు ఇస్తేనే రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇస్తామని ప్రభుత్వంలోని కొందరు డిమాండ్ చేస్తున్నారని కాలేజీల యాజమాన్యాలు ఆవేదన చెందుతున్నాయని అన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల అంశంపై సోమవారం ఎక్స్ లో పోస్టు చేసిన కవిత.. కమిషన్ల కోసమే బకాయిలు ఏళ్లకేళ్లుగా పెండింగ్ పెట్టడంతో ఇప్పటికే కాలేజీలు నడపలేక యాజమాన్యాలు ఆర్థికంగా చితికిపోయాయన్నారు. కాలేజీలు మూతపడితే ఆడబిడ్డలు చదువులకు దూరం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యం తెస్తామని గప్పాలు కొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆడబిడ్డలను చదువులకు దూరం చేస్తోందని దుయ్యబట్టారు. విద్యార్థుల భవిష్యత్ పై బాధ్యతతో ఉన్నాం:ప్రతి విద్యార్థి భవిష్యత్తు పట్ల ప్రజా పాలనలో తాము బాధ్యతాయుత దృష్టితోనే ఉన్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. వృత్తి విద్య కళాశాలలు ఇవాళ్టి నుంచి నిరవధికంగా బంద్ చేస్తున్నట్లు సమాఖ్య ప్రకటించిన నేపథ్యంలో నిన్న రాత్రి ప్రజా భవన్ లో కాలేజీల యాజమాన్యాలతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, సీఎస్, ఉన్నతాధికారులు సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి సంబంధించి సోమవారం భట్టి విక్రమార్క తన ఎఫ్ బీలో పోస్టు చేశారు. ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలతో నిన్న రాత్రి సుమారు నాలుగు గంటల పాటు చర్చలు చరిపామని చర్చలలు సానుకూలంగా కొనసాగాయన్నారు. ప్రైవేట్ కళాశాలల సమస్యలను సమగ్రంగా అవగాహన చేసుకున్నామని చెప్పారు.

# తెలంగాణ జర్నలిస్టులకు గుడ్ న్యూస్.. అక్రిడిటేషన్‌లపై మంత్రి పొంగులేటి కీలక అప్డేట్

**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందేలా విధివిధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో హోమ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రవి గుప్తా, ప్రెస్ అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి, ఐ&పీఆర్ స్పెషల్ కమిషనర్ సీహెచ్. ప్రియాంక, సీపీఆర్వో జీ.మల్సూర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా అక్రిడిటేషన్ పాలసీ, జర్నలిస్టల హెల్త్ పాలసీ, జర్నలిస్టుల అవార్డులు, జర్నలిస్టులపై దాడులకు సంబంధించి హైపవర్ కమిటీ తదతర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టులపై దాడులు జరగకుండా ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకుంటుందని, ఇందుకోసం హైపవర్ కమిటీని కూడా పునరుద్ధరించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి రాష్ట్రంలో 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో జారీ చేసిందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆ ఊసే ఎత్తలేదని విమర్శించారు. అలాగే, జర్నలిస్టుల జీత భత్యాలకు సంబంధించి త్రైపాక్షిక కమిటీని కూడా పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల హెల్త్ పాలసీపై సమగ్రంగా చర్చించామని, ఇన్సూరెన్స్ పాలసీలో ఏది జర్నలిస్టులకు ప్రయోజనకరంగా ఉంటుందో అనే అంశంపై ఆరోగ్యశ్రీ విభాగంతో కలిసి లోతైన అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. అక్రిడిటేషన్ పాలసీపై కూడా సుదీర్ఘంగా చర్చించారు. జర్నలిస్టుల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రత్యేక వెబ్ సైట్‌ను తక్షణమే రూపొందించాలని అధికారులకు సూచించారు. జర్నలిస్టులకు అవార్డులను పునరుద్ధరించాలని ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి పట్ల మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్, కార్మిక శాఖ అడిషనల్ కమిషనర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# నాలాపై ఉన్న 145 ఇళ్లు.. అడ్డుగా ఉన్న ఇళ్లు తొలగిస్తాం..!

**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** హైదరాబాద్ ఆదివారం రాత్రి భారీ వర్షాలతో వణికిపోయింది. అకస్మాత్తుగా కురిసిన కుండపోత వాన కారణంగా నగరంలోని అనేక ప్రాంతాలు మునిగిపోయాయి. ఫ్లాష్‌ఫ్లడ్స్ కారణంగా రోడ్లు, కాలనీలు వరద నీటితో నిండిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో ఆసిఫ్‌నగర్‌లోని మాంగర్‌బస్తీ ప్రాంతం అతలాకుతలమైంది. వరద నీటికి ఇద్దరు కొట్టుకుపోవడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆ ఘటనతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

జిల్లా కలెక్టర్ హరిచందన, హైడ్రా కమిషనర్ రంగనాథ్ తక్షణమే రంగంలోకి దిగారు. మాంగర్‌బస్తీ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా సందర్శించి, అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలకు జరిగిన ఇబ్బందులను తెలుసుకొని, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. దీనికి సంబంధించి స్పష్టమైన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించారు.

ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మాంగర్‌బస్తీ మాత్రమే కాదు, హైదరాబాద్‌లోని అనేక ప్రాంతాల్లో నాలాలు కబ్జాకు గురయ్యాయని ఆయన పేర్కొన్నారు. అలాంటి కబ్జాలు ఉండటం వల్లే ఫ్లాష్‌ఫ్లడ్స్ రూపంలో విపత్తులు సంభవిస్తున్నాయని గుర్తుచేశారు. మాంగర్‌బస్తీ ఘటన మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడమే హైడ్రా ప్రధాన లక్ష్యమని అన్నారు. హైదరాబాద్‌లో హైడ్రా వ్యవస్థ ప్రాధాన్యత ప్రజలకు ఇప్పుడు బాగా అర్థమవుతోందని రంగనాథ్ వివరించారు. అంతేకాదు, ఈ మోడల్‌ను చూసి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా హైడ్రా తరహా వ్యవస్థ అవసరమన్న డిమాండ్ వస్తోందని తెలిపారు.

మాంగర్‌బస్తీ పరిస్థితిపై జిల్లా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ, ఆ ప్రాంతంలో 145 ఇళ్లు నాలాపైనే నిర్మించబడ్డాయని తెలిపారు. స్థానికులు ముందుకొస్తే, వారికి ప్రభుత్వ పథకంలో అందించే ఇందిరమ్మ ఇళ్లకు తరలిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా త్వరితగతిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ కూడా దీనిపై స్పందిస్తూ, మాంగర్‌బస్తీ సమస్యకు వారంరోజుల్లో పరిష్కారం చూపుతామని చెప్పారు. నాలాకు అడ్డుగా ఉన్న నాలుగైదు ఇళ్లను తొలగిస్తామని స్పష్టం చేశారు.

అయితే, అన్ని ఇళ్లను తొలగిస్తారని భయపడాల్సిన అవసరం లేదని, ప్రజల ఇళ్లను కూల్చేయాలన్న ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు.

మాంగర్‌బస్తీ ఘటనతో ప్రభుత్వ యంత్రాంగం కదిలిపోయింది. నాలాల కబ్జాలు, అనధికార నిర్మాణాలు, వర్షాకాలంలో పునరావృతమయ్యే వరద సమస్యలపై సమగ్ర చర్యలు తీసుకోవాలని అధికారులు తేల్చుకున్నారు. వచ్చే వారాల్లో స్పష్టమైన చర్యలు అమలులోకి వస్తాయని, ప్రజలు నమ్మకంగా ఉండాలని సూచించారు.

# ఇప్పుడు ఆ దిక్కుమాలిన విషయం ఎందుకు?.. కవిత ఆరోపణలపై ఈటల వ్యాఖ్యలు



**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఈటల రాజేందర్ సహా పలువురు సీనియర్లు బీఆర్ఎస్ ను వీడిపోవడానికి హరీశ్ రావు, సంతోశ్ రావే కారణం అంటూ తెలంగా జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన వ్యాఖ్యలపై ఈటల రాజేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నన్ను బీఆర్ఎస్ నుంచి బయటకు పంపించి వారు ఏం సాధించారని ప్రశ్నించారు. నేను నవ్వు ముఖంతోనే ఉన్నానని చెప్పారు. సోమవారం హుజూరాబాద్ లో మీడియాతో మాట్లాడిన సందర్భంగా కవిత ఆరోపణలపై మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నపై ఈటల స్పందించారు. యూరియా, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి ఇంత మంచి సబ్జెక్ట్ పై మాట్లాడాక ఆ దిక్కుమాలిన విషయం గురించి ఎందుకు అని అన్నారు. ఆ పార్టీలో ఉండగా నన్ను హింస పెడితే పెట్టొచ్చు. కానీ నాకేమొచ్చింది వారికి ఏమొచ్చిందో అందరికి తెలుసన్నారు. భూలోకంలోనే నరకం అనుభవించిన వ్యక్తిని నేను అని చెప్పారు. నా జీవితంలో మొదటి సారి చూస్తున్న: ప్రైవేట్ కాలేజీలకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, గెస్ట్ లెక్చరర్లు, సిబ్బంది బకాయుల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఈసమస్యలను ముఖ్యమంత్రి పట్టించుకోకుండా మాటలతో అదరగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మీ పర్యటనలపై దినపత్రికల్లో వస్తున్న పతాకశీర్షికలను చూసి మురిసిపోతున్నారు కానీ వాటి వెనుక నలిగిపోతున్న ప్రజల గాథను ఆలోచించాలన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ అనేది ప్రైవేట్ కాలేజీల సమస్య కాదని లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిందండ్రులు, లక్షల మంది లెక్చరర్ల సమస్య అన్నారు. ఈ విషయంలో భేషజాలకు పోకుండా సమస్యను పరిష్కరించాలని బీజేపీ తరపున డిమాండ్ చేశారు. తాను ఇన్నేళ్లుగా ప్రభుత్వంలో ఉండి అనేక బాధ్యతలు చూశానని కానీ ఇంత బాధ్యతారాహిత్యమైన ప్రభుత్వాన్ని మాత్రం తొలిసారి చూస్తున్నానని విమర్శించారు. ఇది మంచిది కాదన్నారు. యూరియా కొరత విషయంలో రాష్ట్ర ప్రభుత్వానిదే నిర్లక్ష్యం అని విమర్శించారు. వర్షాలు బాగా వర్షాలు పడితే యూరియా బాగా వాడుతారని అంతే తప్పా యూరియా వాడకూడదని చెబితే ఎలా అన్నారు. ప్రభుత్వానికి అంచనా ఉండాలి కదా? బఫర్ స్టాక్ పెట్టుకోవాలి కాదా అని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వంపై నిందలు వేయడం ఆపేయాలన్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు.

# గ్రామాల్లో వీధి దీపాల బాధ్యతలు సర్పంచులకే అప్పగించండి: సీఎం రేవంత్



**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** రాష్ట్ర మంతా ఎల్ఈడీ వీధి దీపాలపై పక్కాగా పర్యవేక్షణ ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు, వాటి నిర్వహణ బాధ్యతలను సర్పంచులకే అప్పగించాలని చెప్పారు. గ్రామాల్లో అవసరమైనన్ని కొత్త ఎల్ఈడీ లైట్లను అమర్చటంతో పాటు వాటిని సమర్థంగా నిర్వహించే అధికారం గ్రామ పంచాయతీల పరిధిలోనే ఉండాలని స్పష్టం చేశారు.

సోమవారం పంచాయతీ రాజ్, మున్సిపల్, జీహెచ్ఎంసీ విభాగాలకు సంబంధించి ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వీధి దీపాలకు సంబంధించి గ్రామాల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఎల్ఈడీ లైట్లు వెలుగుతున్నాయా లేదా, కొత్తగా ఎన్ని అవసరం ఉన్నాయో పక్కాగా అంచనా వేయాలని, ప్రతి పోల్ లెక్కించేలా సర్వే చేయాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు.రాత్రి పూట ఎల్ఈడీ లైట్లు పని చేయటంతో పాటు పగటిపూట దుర్వినియోగం కాకుండా పర్యవేక్షణ ఉండాలని, అన్ని గ్రామాల ఎల్ఈడీ డ్యాష్‌బోర్డు మండల స్థాయిలో ఎంపీడీవో పర్యవేక్షణలో ఉండాలని చెప్పారు. జిల్లాలో అడిషనల్ కలెక్టర్‌కు ఈ బాధ్యతలు అప్పగించాలన్నారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల పరిధిలో 16.16 లక్షల ఎల్ఈడీ లైట్లున్నాయని, వరంగల్, నల్గొండ, జనగాం, నారాయణపేట జిల్లాల్లో ఎల్ఈడీ లైట్ల కాంట్రాక్టు ఏజెన్సీ ఆధ్వర్యంలో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అన్ని గ్రామాల్లో సర్పంచులకే వీటిని అప్పగిస్తే.. లైట్ల నిర్వహణ, విద్యుత్తు దుర్వినియోగం కాకుండా అడ్డుకట్ట పడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

రాష్ట్రంలో అన్ని ఎల్ఈడీ లైట్లను హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానం చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 5.50 లక్షల ఎల్ఈడీ లైట్లు ఉన్నాయని, అవుటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ సిటీని కూడా కలిపితే మొత్తం 7.50 లక్షల లైట్లు అవసరమవుతాయని మున్సిపల్ శాఖ నివేదించింది. కోర్ అర్బన్ సిటీ పరిధిలో జీహెచ్ఎంసీతో పాటు కొత్తగా చేరిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామాలన్నింటిని పరిగణనలోకి తీసుకొని ఎల్ఈడీ లైట్ల అవసరాన్ని అంచనా వేయాలని చెప్పారు. కొత్తగా ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు, నిర్వహణకు టెండర్లు పిలవాలని అధికారులను ఆదేశించారు.

ఎల్ఈడీ లైట్ల తయారీలో పేరొందిన కంపెనీలను ఆహ్వానించాలని, ఏడేండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు కంపెనీలకు అప్పగించాలని, నిర్వహణ పక్కాగా ఉండేందుకు వీలుగా టెండర్ నిబంధనలను రూపొందించాలని చెప్పారు. ఎల్ఈడీ లైట్లతో పాటు కంట్రోల్ బాక్స్‌ల ఏర్పాటు, వాటి పనితీరును నిరంతరం పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా వ్యవస్థ ఉండాలన్నారు. హైదరాబాద్ ఐఐటీ లాంటి సంస్థలతో థర్డ్ పార్టీ ఆడిట్ చేయించాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో వీధి దీపాలకు ప్రతి నెలా రూ. 8 కోట్ల కరెంటు బిల్లు అవుతున్నందున, సోలార్ పవర్ వినియోగించే అంశాన్ని, అందుకు అవసరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సీఎం సూచించారు.

# తెలంగాణ సర్కార్ నిర్ణయం.. సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవం



**న్యూస్ డెస్క్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** సెప్టెంబర్ 17వ తేదీ.. తెలంగాణ రాజకీయాల్లో పొలిటికల్ హీట్ డే కూడానూ.. విమోచనమా.. విలీనమా అనే కాంట్రవర్సీ ఎన్నో ఏళ్లుగా నడుస్తూనే ఉంది. ఇలా.. సెప్టెంబర్ 17ను ఎవరికి నచ్చిన విధంగా వారు సెలబ్రేట్ చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది.. సెప్టెంబర్ 17వ తేదీన ప్రజా పాలన దినోత్సవం నిర్వహించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ఆయా జిల్లా ఇంచార్జి మంత్రి జాతీయ జెండా ఎగురవేయాలంటూ సర్క్యులర్ జారీ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. సీఎం రేవంత్ రెడ్డి సైతం సెప్టెంబర్ 17వ తేదీన రాష్ట్ర రాజధాని హైదరాబాద్?లో జాతీయ జెండా ఎగరవేయనున్నారు.

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆయన సొంత జిల్లా ఖమ్మంలో జెండా ఆవిష్కరించనున్నారు. మంత్రి వివేక్ మెదక్ జిల్లాలో జెండా ఎగరేయనున్నారు. సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా సెలబ్రేట్ చేస్తుండగా.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరై జెండా ఆవిష్కరించనున్నట్లు సమాచారం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను జాతీయ సమైక్యతా దినోత్సవంగా నిర్వహించిన విషయం తెలిసిందే.

# ప్రతిపల్లెను ప్రగతివైపు పరుగులు పెట్టిద్దాం

▶▶ గ్రామగ్రామానికి పక్కాగా పక్కా రహదారుల నిర్మాణం జరుగుతుంది ▶▶ గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడితేనే అభివృద్ధి సాధ్యం ▶▶ ప్రజల సంక్షేమ, అభివృద్ధికోసం అహర్నిశలు శ్రమిస్తున్నా ▶▶ కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ▶▶ రూ.4.29 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే



**కొత్తగూడెం/లక్ష్మీదేవిపల్లి, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ప్రజలకు కావాల్సిన వైద్యం, వైద్యం, రహదారులు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించి ప్రతి పల్లెను ప్రగతివైపు పరుగులు పెట్టిస్తానని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం, కోరుకొండ, లోతువాగు, ప్రశాంతి నగర్, శేషగిరినగర్, తెలగారమవరం పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో రూ. 4.29 కోట్ల ఎస్ సి పి, ఎన్ఆర్ఈజిఎస్ పథకాల్లో మంజూరైన నిధులతో చేపట్టనున్న రోడ్లు, డ్రైనేజీలు, ప్రభుత్వ భవనాలు, కల్వర్టుల నిర్మాణ పనులకు శంకుస్థాపన, పూర్తయిన పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన శంకుస్థాపన, ప్రారంభోత్సవాల సభల్లో కూనంనేని మాట్లాడారు. పల్లె రహదారులు, గ్రామాల అనుసంధాన రహదారులు, ప్రధాన రహదారుల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి దశలవారీగా నిర్మాణాలు పూర్తి చేస్తున్నామన్నారు. రహదారుల సౌకర్యం మెరుగు పడితేనే గ్రామాలు అభివృద్ధి సాధిస్తాయని, ప్రతి గ్రామం, పంచాయతి కేంద్రాలలో హెల్త్ సెంటర్లు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గ్రామపంచాయతి కార్యాలయాలు, కమ్యూనిస్టుయి హాళ్లు, ప్రభుత్వ సేవాకేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగా వారి సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికోసం అహర్నిశలు శ్రమిస్తున్నానని, అభివృద్ధి నిధులు రాబట్టేందుకు ఏ అవకాశం వచ్చినా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం జరుగుతోందన్నారు. శంకుస్థాపనలు జరిగిన పనులు నాణ్యతా ప్రమాణాలతో పది కాలాల పాటు ప్రజలకు ఉపయోగపడేలా నిర్మాణాలు జరగాలని, అందుకు అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని, పనులను నిత్యం పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలుసైతం పనులపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల జమలయ్య, సిపిఐ మండల కార్యదర్శి దీటి లక్ష్మీపతి, నునవత్ గోవిందు, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, తూము చౌదరి, వీరబాబు, హన్మంతరావు, పీఏసీఎస్ ఉపాధ్యక్షులు కూచిపూడి జగన్, కాంగ్రెస్ పూణె%శీ% శ్రీనివాస్, అధికారులు అంకుబాబు, శిరీష, శ్రీనివాసరావు, రామకృష్ణ, రఘురామయ్య, వెంకటస్వామి, అమ్మ సాంబయ్య, శివలాల్ తదితరులు పాల్గొన్నారు.

# సొసైటీ పాలక వర్గాలపై కాంగ్రెస్ కపట ప్రేమ

## డీసీవో ను కలిసిన బిఆర్ఎస్ నేతలు తాతా మధు, సండ్ర





**ఖమ్మం బ్యూరో, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ నాయకుల ఒత్తిడి మేరకు పాలేరు, సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలోని ప్రాథమిక సహకార సంఘాల సొసైటీల పాలకవర్గాలను పొడిగించే విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరు అక్షయపనీయమని, గత సాంప్రదాయానికి విరుద్ధంగా వ్యవహరిస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోమని, ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ, ఖమ్మం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాతా మధుసూదన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య లు ధ్వజమెత్తారు. సోమవారం ఖమ్మం లోని బీసీఓ కార్యాలయంలో డీసీఓ ని కలిసి సంబంధిత విషయాలపై వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సొసైటీల పాలకవర్గాల పదవీకాలం ముగిసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం రెండుసార్లు వాటిని పొడిగిస్తూ జీవో జారీ చేసిందని, ఆ జీవో ప్రకారం ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని సొసైటీల పదవీ కాలాన్ని పొడిగించాల్సి ఉందన్నారు. అయినప్పటికీ ఆయా నియోజకవర్గాల కు చెందిన కాంగ్రెస్ నాయకులు దురుద్దేశపూర్వకంగానే పాలేరు, సత్తుపల్లి నియోజకవరర్గాలలో సుమారు కొన్ని సొసైటీల పదవీ కాలాన్ని పొడిగించకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. ఖమ్మం, వైరా మరియు మధిర నియోజకవర్గాలలో ఏ విధంగానైతే సొసైటీల పదవీ కాలాన్ని పొడిగించారు సత్తుపల్లి పాలేరు నియోజకవర్గం కూడా ఉన్న సొసైటీల పాలకవర్గాలను పొడిగించాలని వారి డిమాండ్ చేశారు సాక్షాత్తు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ప్రాతినిధ్యం ఇస్తున్న ఖమ్మం నియోజకవర్గం లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క కు చెందిన మధుర నియోజకవర్గంలో సొసైటీలను పొడిగించి పొడిగించడం జరిగిందని కానీ పాలేరు సత్తుపల్లి నియోజకవర్గాలలో సొసైటీల పదవీ కాలాన్ని పొడిగించడంలో ఎందుకు రాజకీయం చేస్తున్నారని ప్రశ్నించారు ఆయా నియోజకవర్గాలలోఎటువంటి రాజకీయ లేకుండా బిఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్మన్లు ఉన్న కారణంగానే వాటి పదవి కాలాన్ని పొడిగించడం లేదని విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం కానీ గతంలో తెలుగుదేశం, కాంగ్రెస్ ప్రభుత్వాలు సొసైటీల పదవీ కాలాన్ని పొడిగించిన సందర్భాలు అనేకం ఉన్నాయని, అయినప్పటికీ వాటిలో ఎలాంటి వివక్షత చూపలేదు అన్నారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక నాయకులు, మంత్రుల ఒత్తిడితో అధికారులు కావాలనే దురుద్దేశంతో గత సాంప్రదాయానికి భిన్నంగా వివక్షత చూపుతున్నారని ఇలాంటి పద్ధతి కొనసాగటం సరైనది కాదన్నారు. సొసైటీల పదవీ కాలాన్ని రద్దు చేయాలనుకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఒకే నిర్ణయం తీసుకోవాలి తప్ప నియోజకవర్గానికి ఒక తీరుగా వ్యవహరించవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవసరమనుకుంటే రాష్ట్ర వ్యాప్తంగా సొసైటీలు అన్నింటిని రద్దుచేసి ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు ఇప్పటికే స్థానిక సంస్థల పదవీకాలం అయిపోయి అనేక నెలలు గడుస్తున్న వాటిని నిర్వహించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చెందిందని పేర్కొన్నారు అధికారుల తీరు మారకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. జిల్లా సహకార అధికారిని కలిసిన వారిలో డిసిసిబి మాజీ చైర్మన్ కురాకుల నాగభూషణం, అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, నేలకొండపల్లి బిఆర్ఎస్ మండల అధ్యక్షులు ఉన్నం బ్రహ్మయ్య, తిరుమలాయపాలెం మండల అధ్యక్షులు భాష బోయిన వీరన్న, పెనుబల్లి మండలం అధ్యక్షులు కనగాల వెంకటరావు, తల్లాడ మండల అధ్యక్షులు వీరమోహన్ రెడ్డి, కల్లూరు మండలం అధ్యక్షులు పాలెపు రామారావు, పలు సొసైటీల చైర్మన్లు, సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులపై జర్నలిస్టుల నిరసన

**టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ ఆధ్వర్యంలో జడ్పీ సెంటర్లో నల్ల జెండాలతో ప్రదర్శన**

**భారీగా హాజరైన విలేకరులు**

**మద్దతుగా ఆందోళనలో పాల్గొన్న ఐజేయు నాయకులు**



**ఖమ్మం బ్యూరో, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులపై ఖమ్మం జిల్లా జర్నలిస్టులు గళమెత్తారు. ప్రభుత్వ నియంతృత్వ ధోరణిని ప్రశ్నిస్తూ నినాదాలతో హోరెత్తించారు. ఒక ప్రముఖ న్యూస్ ఛానెల్ జిల్లా బ్యూరో సాంబశివరావు, కెమెరామెన్ నాగరాజు పై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలంటూ నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఖమ్మం జెడ్పీ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహం దగ్గర ఆందోళన చేశారు. టియుడబ్ల్యూజే టీజేఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనకు ఐజేయు నేతలు సంఘీభావం ప్రకటించి, నిరసనలో పాల్గొన్నారు. భారీ సంఖ్యలో జర్నలిస్టులు తరలి రావడంతో ఖమ్మం జడ్పీ సెంటర్ నినాదాలతో దద్దరిల్లింది. జర్నలిస్ట్ సాంబశివరావుతో పాటు కెమెరామెన్ తమ విధుల్లో భాగంగా యూరియా కొరతపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడతారా అని టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాం నారాయణ, టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, ఐజేయూ జిల్లా అధ్యక్షుడు ఏనుగు వెంకటేశ్వరరావు, టీజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి ప్రశ్నించారు. భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రభుత్వాల తప్పులను ఎత్తిచూపటమే జర్నలిస్టుల డ్యూటీ అని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని అవమానించేలా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. కావాలని, దురుద్దేశపూర్వకంగానే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రైతుతో తప్పుడు కేసు పెట్టించారని ఫైరయ్యారు. ప్రభుత్వం తప్పులుంటే సరిదిద్దుకోవాలి తప్పించి, వార్తను రిపోర్టు చేసిన విలేకరులపై కేసులు పెడతారా అని మండిపడ్డారు. సాంబశివరావు, నాగరాజు పై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఆందోళనలో పాల్గొన్న ఐజేయు నాయకులు..**

టీయూడబ్ల్యూజే టీజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో...

టీయూడబ్ల్యూజే ఐజేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామనారాయణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాటేటి వేణుగోపాల్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్వనేని వెంకట్రావు జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరావు పాల్గొని ప్రసంగించారు.



**నల్ల జెండాలతో అంబేద్కర్ సెంటర్లో జర్నలిస్టులు నిరసన...**

తొలుత సోమవారం ఉదయం జర్నలిస్టు సాంబశివరావు తో పాటు ఆ ఛానల్ కెమెరామెన్ మరో సహాయకుని పై కేసు నమోదు చేయడాన్ని నిరసిస్తూ ఖమ్మంలోని అంబేద్కర్ సెంటర్లో జర్నలిస్టులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నల్లజెండాలు చేతబట్టి నిరసన ప్రదర్శన చేపట్టారు. అంబేద్కర్ సెంటర్ వరకు నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించి ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ దిన పత్రికలు, చానళ్ల కు చెందిన జర్నలిస్టులు, డిజిటల్ మీడియా జర్నలిస్ట్ లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో టియుడబ్ల్యూజే టీజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బొల్లం శ్రీనివాస్, వనం నాగయ్య, ప్రశాంత్ రెడ్డి, శెట్టి రజనీకాంత్, జిల్లా నాయకులు అడపాల నాగేందర్, దుంపల భాస్కర్, కె హరీష్ మందటి వెంకటరమణ, మందుల ఉపేందర్, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుద్దేటి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి కొరకొప్పుల రాంబాబు, ఆర్టివి జిల్లా ఇన్చార్జి ఉదయ్, టీఎస్ చక్రవర్తి, అమరవరపు కోటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు ఎలమందల జగదీష్, కార్యదర్శి అశోక్, సీనియర్ జర్నలిస్టు రామిశెట్టి విజేత, కాపర్తి నరేంద్ర, బిక్కి గోపి,తదితరులు పాల్గొన్నారు ఐజెయూ నేతలు ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యం భూపాల్ మహేందర్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు కనకం సైదులు జిల్లా కోశాధికారి శివానంద, నగర అధ్యక్షులు చెరుకుపల్లి శ్రీనివాస్ నగర ప్రెస్ క్లబ్ కార్యదర్శి శీలం శ్రీనివాస్ మీడియా ప్రతినిధులు శ్రీధర్ నారాయణ సత్యనారాయణ వీడియో జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులపై అక్రమ కేసులు సరికాదు

**టి న్యూస్ సాంబ, కెమెరామెన్ నాగరాజుపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి**

**టియూడబ్ల్యూజే(టిజెఎఫ్) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా**

**సంఘీభావం తెలిపిన బిఆర్ఎస్, సిపిఐ(ఎం), ఎంఎల్ పార్టీలు**

**ఎస్పీ రోహిత్ రాజ్ ఐపిఎస్ కు వినతిపత్రం అందజేత**



**కొత్తగూడెం, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** తెలంగాణ వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న యూరియా కొరతపై ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలంలో రైతుల చేత అభిప్రాయ సేకరణ చేస్తున్న టీ న్యూస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో వెన్న సాంబశివరావు, కెమెరామెన్ నాగరాజుల పైన కొనిజర్ల పోలీసులు కేసు నమోదు చేయడానికి నిరసిస్తూ టిజేఎఫ్ అనుబంధ టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సోమవారం పాల్వంచ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. తక్షణమే సాంబశివరావు, నాగరాజులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు కల్లోజి శ్రీనివాస్ రావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు చంద్ర నరసింహారావు, గుర్రం రాజేష్ డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వనమా రాఘవేంద్రరావు, సిపిఐ(ఎం) నాయకులు అన్నవరపు సత్యనారాయణ మాట్లా డుతూ.. ప్రభుత్వం కక్షపూరితంగా జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. జర్నలి స్టులకు టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు జునుమాల రమేష్, టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు డివి, టియుడబ్ల్యుజే జిల్లా కార్యదర్శి ఎండి షఫీ, టెంజూ జిల్లా అధ్యక్షులు వట్టికొండ రవి, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వర రావు, సమ్మయ్య గౌడ్ లు మాట్లాడారు. అనంతరం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఐపిఎస్ ను కలిసి వినతిపత్రం అందజేసినారు. ఈ కార్యక్రమంలో తాండ్ర కృష్ణ గోవింద్, ప్రభాకర్ రెడ్డి, టీవీ9 రవి, సీమకుర్తి రామకృష్ణ, రవీంద్ర, ఆవుల కోటేష్, ప్రవీణ్, ఈశ్వర్, రాము, రాజ్ కుమార్ తాండ్ర, రాందాస్ నాయక్, దుర్గ, సురేష్, కవటం శ్రీనివాస్, చంద్ర శేఖర్, నరేష్, కొట్టి నవీన్, కెరటం శామ్, వీరు నాయక్, క్రాంతి, శ్యామ్, సతీష్, ఇల్లందు పాత్రికేయులు రాధా కృష్ణ, పాల్వంచ నాయకులు ఆర్ సంజీవ్ కుమార్, తోట రామకృష్ణ, తోట శ్రీనివాసరావు,అల్లాడ రమేష్, సయ్యద్ నజీ ర్, ఫణి, సంతోష్ జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# వెయిట్ లిఫ్టింగ్ లో సత్తా..



**కొత్తగూడెం, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఈ నెల 14న ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన అశ్మితా ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో భద్రాద్రి కొత్తగూడెం ఆటగాళ్లు ఒక బంగారం పతకం, ఏడు వెండి పతకాలు, మూడు కాంస్యం పతకాలు సాధించి సత్తా చాటారు. వై. అంజలి 53 కేజీల విభాగం సబ్ జూనియర్ ,జూనియర్, సీనియర్ విభాగంలో మూడు కాంస్య పతకాలు, జి. శ్రుతి 58 కేజీల విభాగంలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, విభాగంలో మూడు వెండి పతకాలు, బి. బిందు ప్రియ 77 కేజీల విభాగం సబ్ జూనియర్,జూనియర్, సీనియర్, మూడు వెండి పతకాలు, డి. సాహితి 86 కేజీల విభాగం, జూనియర్ విభాగంలో ఒక బంగారు పతకం సీనియర్ విభాగం లో ఒక వెండి పతకం సాధించారు. ఈ ఆటగాళ్లు అందరూ టిజిటిడబ్ల్యూఆర్జేసీ (గర్ల్స్) సుదిమల్లలో చదువుతున్నారు.విజేతలను కొత్తగూడెం శాసనసభ్యులు కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, కొత్తగూడెం నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ ఎండీ బాబ్జి, భద్రాద్రి వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు వాసిరెడ్డి నరేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి పి.చైతన్య, ట్రెజరర్ జి. విజయ్ కుమార్, కోచ్ లోహిత, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

# ప్రకృతిపై ప్రేమకు దక్కిన సత్కారం

**ప్రకృతి హరిత దీక్షురాలు పారుల్ కి మదర్ తెరిసా సేవా పురస్కారం**

**అభినందించిన మన్ కీ బాత్, మొక్కల ప్రేమికుడుకె ఎన్ రాజశేఖర్**



**కొత్తగూడెం, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** విజయవాడలో జరిగిన మదర్ సర్వీసెస్ సొసైటీ మూడో వార్షికోత్సవం సందర్భంగా ప్రకృతి హరిత దీక్ష తీసుకొని మొక్కలు నాటుతున్న భద్రాద్రి కొత్తగూడెం సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థిని, ప్రకృతి హరిత దీక్షురాలు చిరంజీవి కె. పారుల్ కి మదర్ తెరిసా సేవ రత్న అవార్డుని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పారుల్ మాట్లాడుతూ.. సేవా సంస్థ ఫౌండర్ మల్లాది ప్రసాద్ వారి ఫౌండేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలుపుతూ తనకు ఓపిక ఉన్నంతకాలం చదువుకుంటూ మొక్కలు నాటుతానని తెలిపారు. తనతో 2021వ సంవత్సరంలో మొక్కలు నాటించి తనకు ప్రకృతి హరిత దీక్ష ఇచ్చిన మొక్కల రాజశేఖర్ కి రుణపడి ఉంటానన్నారు. ఈ సందర్భంగా మన్ కీ బాత్, ప్రకృతి ప్రేమికులు కె.ఎన్ రాజశేఖర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు కూడా ఈ చిన్నారినీ ఆదర్శంగా తీసుకొని మొక్కలు నాటి సంరక్షణ చేసి ప్రకృతి సేవలు చేయాలని కోరారు. చిన్నతనంలోనే మొక్కలు నాటేందుకు విశేష కృషి చేస్తూ అవార్డు అందుకోవడం పట్ల ప్రకృతి హరిత దీక్ష గౌరవ సలహాదారులు సంగం వెంకట పుల్లయ్య, షేక్ దస్తగిరి, లగడపాటి రమేష్ చంద్, సతీష్ గారు, గౌస్ బాయ్, ఇంగ్లీష్ మీడియా బాలు, యంగ్ ఇండియన్ బాలు ప్రకృతి ప్రేమికులు బరిగల భూపేష్, వరల్డ్ ఎన్విరాన్మెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి, ముస్తాఫా, రామవరం పరిరక్షణ సమితి అధ్యక్షులు, తూముల శ్రీనివాస్ ప్రజాకవి, జి సుగుణ రావు ప్రకృతి వైద్యులు, ప్రముఖ యోగ రాణి తదితరులు పారుల్ నీ, తన తల్లిదండ్రులను అభినందించారు.

## మీడియా ప్రతినిధిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

**పోలీస్లు ప్రజాస్వామికంగా వ్యవహరించాలి**

**పోలీస్ కమీషనర్కు వినతిపత్రం అందజేసిన తాతా మధు, సండ్ర**



**ఖమ్మం బ్యూరో, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఉమ్మడి ఖమ్మం జిల్లా టీ న్యూస్ ప్రతినిధి సాంబశివరావుపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, పోలిస్ వ్యవస్థ ప్రజాస్వామికంగా వ్యవహారంచాలని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎంఎల్ఎ, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సండ్ర వెంకటవీరయ్యలు పోలిస్ కమీషనర్ సునిల్ దత్ను కోరారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఖమ్మం నగరంలోని ఆయన కార్యాలయంలో కలి.. వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కొణిజర్లలో రైతులు యూరియా కోసం ఇబ్బందులు పడుతున్న దృష్యాలను మీడియా ప్రతినిధి తన విధుల్లో భాగంగా వ్యవరిస్తే ఆ విషయా తప్పుదోవ పట్టించి కావాలనే విలేకరులపై తప్పుడు కేసులు నమోదు చేశారన్నారు. వాటిని వెంటనే ఎత్తివేయాలని, మీడియా స్వేచ్ఛను కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీని కలిసిన వారిలో బిఆర్ఎస్. లీ సెల్ బిచ్చాల తిరుమలరావు, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషభోయిన వీరన్న, ఉన్నం బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు సాంబ పై అక్రమ కేసులు ఎత్తివేయాలి

**-డీజీపీ ని కలిసిన టియుడబ్ల్యూజే నేతలు**



**హైదరాబాద్ బ్యూరో, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తూ, ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తున్న జర్నలిస్టులపై కక్ష పూరితంగా కేసులు పెట్టడం దుర్మార్గం అని టియుడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్ అన్నారు. రాజ్యాంగం కల్పించిన ఆర్టికల్ 19(1) ఏ మీడియా స్వేచ్ఛ హక్కును హరించే దిశగా ఇటు ప్రభుత్వం అటు పోలీసులు ఇలాంటి అక్రమ కేసులు బనాయించి జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో యూరియా కోసం పడుతున్న ఇబ్బందులను రిపోర్టు చేస్తున్న ఖమ్మం జిల్లా టి.న్యూస్ బ్యూరో చీఫ్ సాంబశివ రావు పై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడాన్ని టీయూడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి మారుతిసాగర్, తెంజు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.రమణ కుమార్ లు తీవ్రంగా ఖండించారు. జర్నలిస్టు సాంబశివ రావు పై అక్రమ కేసుకు నిరసనగా సోమవారం హైదరాబాద్ లోని ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం రాష్ట్ర డీజీపీ జితేందర్ ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టి.న్యూస్ ఖమ్మం జిల్లా బ్యూరో చీఫ్ ఈ సాంబశివరావు పై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. ఆయనపై నాన్ బెయిలబుల్ సెక్షన్ నమోదు చేశారని డీజీపీకి తెలిపారు. తాను కేసు వివరాలు తెలుసుకొని, సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని డీజీపీ తనను కలిసిన జర్నలిస్టు సంఘం నాయకులకు హామీ ఇచ్చారు. ట్యాంక్ బండ్ వద్ద నిరసన తెలిపి, డీజీపీని కలిసిన వారిలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి పి. యోగానంద్, యార నవీన్ కుమార్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు రాకేశ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సోమేశ్వర్, కోశాధికారి బాబురావు, రాష్ట్ర నాయకులు సూరజ్ భరద్వాజ్, శివారెడ్డి, శ్రీధర్ ప్రసాద్, భాస్కర్, చిన్న పత్రికల సంఘం అధ్యక్షుడు బిజిగిరి శ్రీనివాస్, అగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొంగులేటిని కలిసి వినతి

జర్నలిస్టు సాంబశివరావు పై నమోదు చేసిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని టి యు డబ్ల్యూ జే నాయకులు సచివాలయంలో కలిసి కోరారు. దీనిపై స్పందించిన మంత్రి ఒకటి రెండు రోజుల్లో దీనిపై పూర్తి వివరాలు తెలుసుకొని జర్నలిస్టుకు న్యాయం జరిగేలా చూస్తారని హామీ ఇచ్చారు.



# మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ఎనలేని కృషి

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్

## ఘనంగా మహిళా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం





**ఖమ్మం బ్యూరో, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అన్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో మహిళా కాంగ్రెస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....మహిళలకు న్యాయం జరగాలి అంటే కాంగ్రెస్ తోనే సాధ్యం అవుతుందని అన్నారు.మహిళల్ని రాజకీయంగా చైతన్యవంతం చేయాలని ఉద్దేశంతో నాటి కాంగ్రెస్ నాయకత్వం 1952 లోనే కాంగ్రెస్ పార్టీకి మహిళా సెల్ ను ఏర్పాటు చేసిందని అన్నారు. 1983 లో ముంబయి ఏఐసీసీ సమావేశంలో దీనికి పూర్తిస్థాయి స్వతంత్ర సమస్త హెూగా ఇవ్వాలని తీర్మానం చేయడం జరిగిందని అన్నారు. అదే నేడు మహిళా కాంగ్రెస్ సంఘంగా ఏర్పాటు జరిగిందని తెలియజేశారు. ద్వారా మహిళలకు రాజకీయంగా ఎన్నో అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ... మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీ కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నేడు రాష్ట్రంలో ఏ పథకం అమలు చేయాలన్న మహిళల పేరు మీదనే అమలు చేయడం మహిళల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న గౌరవ మర్యాదలు ఏంటో తెలుసుకోవచ్చని అన్నారు. మహిళా సెల్ గా ఏర్పడిన మహిళా కాంగ్రెస్ 1984 లో ముంబై లో బెంగుళూరు లో జరిగిన జాతీయ మహాసభలో ఒక ఫ్రాంటల్ ఆర్గనైజేషన్ గా ఏర్పడి దేశవ్యాప్తంగా రాష్ట్ర, జిల్లా,మండల స్థాయిలో విస్తరించిందని తెలిపారు. అందుకే సెప్టెంబర్ 15న మహిళ కాంగ్రెస్ ఫౌండేషన్ డే గా ప్రతి సంవత్సరం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సంవత్సరంతో మహిళా కాంగ్రెస్ ఏర్పడి 41 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని అన్నారు. ఈ సందర్భంగా మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మరొకసారి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో వీరితో పాటు పి సి సి సభ్యులు, జిల్లా ఓ బి సి సెల్ అద్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్,జిల్లా కాంగ్రెస్ నాయకులు మూడుముంతల గంగరాజు యాదవ్, దేవత్ దివ్య, రమా,దామా స్వరూప, బిక్కసాని స్వరూప, ఏలూరి రజని,ఊరుకొండ చంద్రిక,బలుసు లక్ష్మీ, నీలవేణి,భవానీ,నసీమా, రమాదేవి తదితర నాయకులు పాల్గొన్నారు.

## నేషనల్ సైన్స్ సెమినార్ కు త్రివేణి విద్యార్థి



**ఖమ్మం ఎడ్యుకేషన్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియం బెంగళూరు వారు నిర్వహించిన నేషనల్ సైన్స్ సెమినార్ 2025 లో త్రివేణి విద్యార్థి కే.వనిషారెడ్డి డిస్ట్రిక్ట్ సాయి లో మొదటి స్థానం సాధించి రాష్ట్రస్థాయికి సెలెక్ట్ అయింది. ఖమ్మం పట్టణంలోని సైన్స్ మ్యూజియంలో జరిగిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ లో ప్రథమ స్థానం పొందిన వనిషారెడ్డిని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఖమ్మం అర్బన్ మండల్ విద్యాశాఖ అధికారి శైలజ లక్ష్మీ గారు, ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఇనుముల వెంకటేశ్వర్లు, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కె రామారావు, జీవశాస్త్ర జిల్లా రిసోర్స్ పర్సన్ టి మాధవరావు మరియు హాజరైన ఉపాధ్యాయులు మొదలగువారు అభినందించారు త్రివేణి విద్యాసంస్థల అధిపతి గొల్లపూడి వీరేంద్ర చౌదరి గారు మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులు చదువులోనే కాక జిల్లా, రాష్ట్ర ,జాతీయ, మరియు అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీ పరీక్షలలో మరియు సైన్స్ కి సంబంధించిన కాంపిటీషన్స్ లో ప్రతిభ చాటుతున్నారని తెలియజేశారు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ త్రివేణి పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ ఆధారంగా అనేక ఉన్నత శిఖరాలను అధిరోహించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి సంస్థల అధిపతి వై వెంకటేశ్వర రావు గారు సి ఆర్ ఓ మురళీకృష్ణ గారు వైస్ ప్రిన్సిపల్ ముస్తఫా స్వప్న గారు మరియు క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్ సందీప్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో 17న మెగా రక్తదాన శిబిరం

**మోడీ జన్మదినం , విమోచన దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమం**

**సేవాభావంతో ప్రజలు ముందుకు రావాలి**

**బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు.**



**ఖమ్మం బ్యూరో, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం, తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా ఖమ్మం నగరంలో ఈనెల 17వ తేదీన మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు బిజెపి జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు సోమవారం ప్రకటించారు. ఖమ్మం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో ఈ కార్యక్రమం జరగనుందని తెలిపారు. సేవా భావంతో రక్తదానం చేయడం వల్ల అనేక మంది ప్రాణాలు కాపాడబడతాయని, ప్రతి పౌరుడు ఒక ప్రాణరక్షకుడిగా నిలుస్తారని అన్నారు. మోడీ జన్మదినాన్ని గుర్తించేందుకు దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఖమ్మంలో రక్తదాన శిబిరం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆయన వివరించారు. అదేవిధంగా తెలంగాణ విమోచన దినోత్సవం, మోడీ జన్మదినం ఒకే రోజు రావడం చారిత్రక ప్రత్యేకత. ఈ సందర్భాన్ని గుర్తించేందుకు పార్టీ తరఫున శ్రేయోభిలాషులు, యువత, కార్యకర్తలతో కలిసి రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ మెగా రక్తదాన శిబిరానికి ప్రజలందరూ ముందుకు వచ్చి సేవా కార్యక్రమంలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు.

## జనసేన నుండి కాంగ్రెస్ లో చేరిక



**ఖమ్మం టౌన్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్):** ఖమ్మం పట్టణం 51వ డివిజన్ లో గత మున్సిపల్ ఎన్నికల్లో జనసేన పార్టీ నుండి కార్పొరేటర్ గా పోటీ చేసిన సింగారపు చంద్రమౌళి,48 వ డివిజన్ సీనియర్ నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు వంగూరి స్వామి లు సోమవారం కాంగ్రెస్ లో చేరారు.జిల్లా ఆర్టిఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు ముగ్గురు మంత్రుల ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పార్టీకి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. సింగారపు చంద్రమౌళి, వంగూరి స్వామి లు మాట్లాడుతూ.... పార్టీ విలువలకు కట్టుబడి ఉంటూ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరవేసేందుకు తమ వంతు కృషి చేస్తామని పార్టీ సిద్ధాంతాలను కొనసాగిస్తానని, ఖమ్మం పట్టణ నాయి బ్రాహ్మణ సంఘ మాజి అధ్యక్షునిగా, సీనియర్ నాయీ బ్రాహ్మణ సంఘ నాయకునిగా రాజకీయపరంగా తమకు ఎంతో అనుభవం ఉందని ఆ అనుభవాన్ని అనుకరిస్తూ పార్టీ అభివృద్ధికితమ వంతు కృషి చేస్తూ , పార్టీ అభివృద్ధికి అహర్నిశలుకష్టపడి పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు పి సి సి సభ్యులు,జిల్లా ఓబీసీ సెల్ అద్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, జిల్లా కాంగ్రెస్ నాయకులు మూడుముంతల గంగరాజు యాదవ్,51వ డివిజన్ అధ్యక్షులు జంపాల రామకృష్ణ, మేడారపు హరినాథ్,రాచమల్ల నరసింహారావు, సింగారపు కృష్ణ, రాచమల్ల జాని, మామిడాల కుమారస్వామి, జంపాల జంపన్న, దూదిపాళ్ళ ఉపేందర్, గొల్లపూడి ఉపేందర్, దాసు నాగరాజు, రాచమల్ల హనుమంతరావు, రామవరపు నాగరాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

## జీపిఓ గా జాయినింగ్ ఓ అనుభూతి



ఖమ్మం ఎడ్యుకేషన్, 15 సెప్టెంబర్ (కెరటం న్యూస్): ఏన్కూర్ మండల కేంద్రంలో గ్రామ పరిపాలన అధికారిగా సోమవారం జాయిన్ అయ్యాను. ప్రభుత్వం పెట్టిన పోటీ పరీక్షలో ఖమ్మం జిల్లా లో 25వ ర్యాంక్ సాధించి. రాష్ట్ర స్థాయిలో 619 ర్యాంక్ సాధించి. నాన్ లోకల్ జిల్లా క్యాడర్ లో, ఏన్కూర్ హెడ్ క్వార్టర్ గ్రామ పరిపాలన అధికారిగా నియామకం అయ్యాను. గవర్నమెంట్ ప్రజాపాలన ప్రభుత్వం రైతులు సంక్షేమం కొరకు నూతనంగా రెవిన్యూ చట్టం. 2025 తీసుకొచ్చింది. దీని ద్వారా ప్రజలు కు ఎంతో మేలు జరుగుతుంది. రైతులుకు జి పి ఓ సిస్టమ్ ద్వారానే సంక్షేమ పథకాలు, భూ సమస్యలు గ్రామ పాలనా ద్వారానే సాధ్యం అని . ప్రభుత్వ ఉద్దేశ్యం నెరవేరస్తాం.